క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అజరా ఆస్పత్రి, ములుగు రోడ్డు, ఎస్‌వీపీ రోడ్డు, న్యూ కాపువాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపటి కేయూ బంద్ వాయిదా

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు కేయూ భూములు కేటాయిస్తూ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న తలపెట్టిన కేయూ బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, ఏబీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, బీఆర్ఎస్‌వీ నాయకులు వస్తం అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో బంద్‌ను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలో భూమిలో కాకుండా బయట ప్రభుత్వ భూముల్లో నిర్మించాలని సూచించారు.

20న కవితా సంపుటి ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని నారాయణ కళాశాలలో ఈ నెల 20న ఉదయం ఉజ్వల సాహితీ సాంస్కృతిక సమితి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రచయిత శనిగరపు రాజ్‌మోహన్ తెలిపారు. చిమ్నీల వెలుగులు అనే లఘు కవితా సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ఆవిష్కరించనున్నారని, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాటికొండ రమేష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్, పెద్ది ఆంజనేయులు తదితరులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

దేశభక్తి కలిగి ఉండాలి



హన్మకొండ అర్బన్: యువత దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా గుడిలోని సాయినాథుడిని ఏసీపీ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మందిర చైర్మన్ హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్.. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



మడికొండ: వరంగల్ 46వ డివిజన్ మడికొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వస్కుల నాగరాజు, శివ, గుర్రం అమర్‌నాథ్, పల్లపు రాజు, వినయ్, శ్రీను, సంపత్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై పరీక్షల విభాగానికి వెళ్తున్న జగన్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు, ఉద్యోగులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరన్న, ఉద్యోగులు డాక్టర్ శాగంటి శ్రీనివాస్, లావణ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాలకు తీరని లోటు


న్యూశాయంపేట: ప్రభంజన్ యాదవ్ మృతి బీసీ ఉద్యమాలకు తీరనిలోటని, బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే ఆయనకు తామిచ్చే నిజమైన నివాళి అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, బీసీ మేధావుల వేదిక వరంగల్ బాధ్యులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయన మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కార్మికుల భద్రతకు 'నమస్తే'

కాజీపేట: పట్టణాలు, నగరాల్లో నిత్యం వెలువడుతున్న చెత్త తొలగింపు, మురుగుదొడ్ల వ్యర్థాలను శుభ్రం చేసే పాకీ పనిచేసే వారికి భద్రత కల్పించేందుకు 'నమస్తే' (జాతీయ యాంత్రిక పారిశుద్ధ్య పర్యావరణ వ్యవస్థ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పట్టణాలు, నగరాల్లో చెత్త ఏరుకునే పనివారికి, మురుగుదొడ్లు శుభ్రం చేసే పాకీ పనివారికి, సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే కార్మికుల రక్షణ కల్పించేలా కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

కార్మికుల ఆరోగ్య రక్షణకు..

పారిశుద్ధ్య పనుల కారణంగా కార్మికులు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. సురక్షిత పద్ధతిలో పనులు చేసుకునేలా వారికి పీపీఈ కిట్లు అందించడం, సాధ్యమైనంత వరకు యంత్రాలను వినియోగించి పనిచేసేలా చూడటంతో వారి ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో ఆయా వృత్తులు చేసుకుని జీవనం సాగించే వారిని గుర్తించి వారి వివరాలను నమస్తే యాప్‌లో అధికారులు నమోదు చేస్తున్నారు. మున్సిపాలిటీల పారిశుద్ధ్య విభాగం అధికారులు గుర్తించిన వారికి భవిష్యత్‌లో పలు పథకాలు వర్తింపజేయనున్నారు. వృత్తి పనులు చేసుకునే వారిని గుర్తించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పురపాలక సంఘాలకు ఉత్తర్వులు అందాయి.



వర్తింపజేసే పథకాలు ఇవే..

- రూ.5 లక్షల వరకు పావలా వడ్డీ రుణాలు
- ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5 లక్షల వరకు వైద్య సాయం
- 60 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ప్రతినెలా రూ.3 వేల పింఛన్
- కార్మికుల పిల్లలు చదువుకునేందుకు ఆర్థిక సాయం

కేయూలోనే ఆ స్కూల్ నిర్మించాలి



మాట్లాడుతున్న మహ్మద్‌పాషా

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలోనే నిర్మించాలని కేయూ ఐక్య కార్యాచరణ సమితి బాధ్యులు డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో వివిధ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థి నాయకుడు మహ్మద్‌పాషా అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కేయూ భూమిలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపు స్థలంలో 12 ఎకరాల్లో స్కూల్ నిర్మించాలని సూచించారు. ఈ స్కూల్ ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ రాజునాయక్, వినోద్ లోక్‌నాయక్ (గిరిజన శక్తి), మట్టెడ కుమార్ (కుర్మా), తిరుపతి (డీవైఎఫ్ఐ), బొట్ల మనోహర్ (బీఎస్ఎఫ్), మాలోతు వెంకట్ నాయక్, రమేష్ నాయక్ (టీటీఎస్ఎఫ్), ఓర్సు రాజేందర్ (కేయూ డాక్టరేట్స్ అసోసియేషన్), కేతపాక ప్రసాద్ (ఎంవీపీ), నాగరాజు (పీసీఎస్ఎఫ్), మాసాని ప్రదీప్ (ఎస్ఎస్‌బీఎం), కర్నె గణేష్ (బీబీ విద్యార్థి సంఘం), వంశీకృష్ణ (డీఎస్‌యూ), ఆలువాల కార్తీక్, రాకేష్ (యూత్ కాంగ్రెస్), ఫోరం రాహుల్ (ఎన్ఎస్‌యూఐ) పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మెరుగైన వసతులు

రామన్నపేట: వరంగల్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు మెరుగైన వసతులతో పాటు ప్రభుత్వ పథకాలతో నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సరస్వతి తెలిపారు. మెరుగైన హాస్టల్ వసతి, అనుభవం కలిగిన బోధన సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అందించే స్కాలర్‌షిప్‌లు లభిస్తుండటంతో పాటు సివిల్, ఈసీ బ్రాంచీలకు ఎన్‌బీఏ న్యూఢిల్లీ అక్రిడిటేషన్ ఉందని పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన అమ్మాయిలు పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఆప్షన్ ఇచ్చి ప్రవేశం పొందాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాలలో బీఏ ఆనర్స్ సోషియాలజీ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ఆనర్స్ సోషియాలజీ కోర్సు అందుబాటులో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, సోషియాలజీ విభాగం ఇన్‌చార్జ్ పుల్లా రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దోస్త్-2025 ద్వారా ప్రవేశాలు పొందాలని వారు సూచించారు.

'హత్యాయత్నం'లో ఆరుగురిపై కేసు

● హనుమకొండ ఏసీపీ నర్సింహారావు

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట సమీపంలో ఇటీవల ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనలో ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదైనట్లు హనుమకొండ ఏసీపీ నర్సింహారావు తెలిపారు. ఈ మేరకు వివరాలను గురువారం వెల్లడించారు. హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన చిర్ర నరేష్ అదే ప్రాంతానికి చెందిన మట్టెడ సంతోష్ అలియాస్ చంటి మధ్య కొంతకాలంగా వైరం కొనసాగుతోంది. గతేడాది చంటితో పాటు మరికొంతమంది వ్యక్తులు చిర్ర నరేష్‌పై దాడి చేసి బెదిరించారు. ఈ సంఘటనలో హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పుడే కేసు నమోదైంది. ఈ నెల 13వ తేదీన మట్టెడ సంతోష్‌తో పాటు ల్యాదెళ్ల శ్రీకాంత్, మట్టెడ కర్ణాకర్ ఎర్రగట్టు గుట్ట వద్ద ఓ వైన్స్‌షాపు సమీపంలో ఆటో ఆపి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో చిర్ర నరేష్, చిర్ర రాము, చిర్ర సుమన్, పరికిరాల కార్తీక్ వనభోజనానికి వెళ్లి తిరిగి మద్యం కోసం వైన్స్‌షాపుకు వచ్చారు. ఈ క్రమంలో కోర్టులో ఉన్న కేసులో రాజీ పడాలని అక్కడికి వచ్చిన నరేష్‌తో చంటి అన్నాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువురి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిర్ర నరేష్, చిర్ర రాము, చిర్ర సుమన్, పరికిరాల కార్తీక్‌పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌తో పాటు హత్యాయత్నం, మట్టెడ కర్ణాకర్, ల్యాదెళ్ల శ్రీకాంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఏసీపీ నర్సింహారావు వివరించారు. సమావేశంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యనాథ ఆలయ నిర్మాణానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

నయీంనగర్: వైద్యనాథ స్వామి దేవాలయం నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు భూనేటి కిషన్ రెడ్డి కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ సమీపంలోని పల్లగుట్ట రోడ్డు వైద్యనాథ స్వామి దేవాలయం మహత్యం గురించి వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దాసానంద, శివకృష్ణ, రేవంత్, హరిలాల్, రమేష్ పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు బాధ్యులు తెలిపారు. హనుమకొండలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీచేయాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టాలని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, జాతీయ నూతన విద్యావిధానాన్ని విరమించుకోవాలని అన్నారు. సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు అనూష, రోహిత్, భానుప్రసాద్, వేల్పుల చరణ్, జ్యోతి, కల్యాణ్, సాయికుమార్, జశ్వంత్, రాహుల్, గణేష్, బి.రాజు, బాలకృష్ణ, వంశీలత పాల్గొన్నారు.

జిల్లాకు 'కాయకల్ప' అవార్డులు

గీసుకొండ: వరంగల్ జిల్లాకు కాయకల్ప అవార్డుల పంట పండింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా 2024–2025 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ఈ అవార్డుకు మెరుగైన వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, కలిగి ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో జిల్లా నుంచి మొత్తం 22 ఆరోగ్య కేంద్రాలు కాయకల్ప అవార్డుకు ఎంపికై నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు గురువారం తెలిపారు.

ఎంపికైన పీహెచ్‌సీలు

జిల్లాలో 14 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో గీసుకొండ, పర్వతగిరి, సంగెం, నెక్కొండ, నల్లబెల్లి, మేడపల్లి, కేశవాపూర్, అలంకానిపేట, పైడిపల్లి పీహెచ్‌సీలు కాయకల్ప అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ అవార్డు కింద ఎంపికైన 9 పీహెచ్‌సీలకు రూ.6 లక్షల నగదు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

యూపీహెచ్‌సీలు..

జిల్లాలో ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కీర్తినగర్, దేశాయిపేట, చింతల్ పీహెచ్‌సీలను అవార్డుకు ఎంపిక చేశారు. వీటికి రూ.మూడు లక్షలను ప్రోత్సాహకంగా అందిస్తారు.

కలెక్టర్ అభినందనలు

వరంగల్ జిల్లాలోని 22 ఆరోగ్యకేంద్రాలు జిల్లాస్థాయి కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడంతో కలెక్టర్ సత్యశారద.. వైద్యాధికారులు, సిబ్బందిని అభినందించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. ఆరోగ్య జిల్లాగా మార్చడానికి వైద్య, ఆరోగ్య విభాగం మరింత కృషి చేయాలని ఆయన కోరారు.

3న ఏఐవైహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నయీంనగర్: ఆగస్టు 3న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి (ఏఐవైహెచ్‌పీఎస్) 29వ ఆవిర్భావ దినోత్సవ సభకు ఎరుకల కులస్తులు వేలాదిగా తరలిరావాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరుకలు మొట్టమొదటి ఆదివాసీ బిడ్డలని, భూమి పుత్రులని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 3 లక్షల ఆదివాసీ ఎరుకల కోసం ఎరుకల ఫెడరేషన్ ఏర్పాటు చేసి, ఏకలవ్య కోఆపరేటివ్ ఫైనాన్స్ సొసైటీకి చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పులిచేరి నరేందర్, పల్లకొండ సాంబమూర్తి, కూరాకుల సమ్మయ్య, లోకిని లెనిన్, సదయ్య, సురేష్, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాల అనుమతి రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న కాలనీ వాసులు

నయీంనగర్: నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాల మధ్య ఏర్పాటు చేస్తున్న పయోనీర్ స్కూల్ అనుమతిని రద్దు చేయాలని 54వ డివిజన్ ప్రేమనగర్ కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీలోని పాఠశాల ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సోదా రామకృష్ణ మాట్లాడుతూ ప్రేమ్‌నగర్ కాలనీ పూర్తిగా రెసిడెన్షియల్ జోన్‌లో ఉందని అన్నారు. వన్నాల గోవిందరాజు అనే వ్యక్తి కాలనీలోని ఇళ్ల మధ్య అపార్ట్‌మెంట్ నిర్మించి, కార్పొరేషన్‌లో బోర్డింగ్ పర్మిషన్ తీసుకొని స్కూల్ భవనం కట్టినట్లు తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పాఠశాల అనుమతి రద్దు చేసి కాలనీవాసుల ప్రశాంతతను కాపాడాలని కోరారు. సమావేశంలో వెంకట్రామ్ రెడ్డి, నారాయణ రెడ్డి, సురేందర్ రావు, పైడిపాల అశోక్, సమ్మిరెడ్డి, సదాశివుడు, శ్రీనివాస్, వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండాను ఎగురవేయాలి

హసన్‌పర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలంలోని నాగారం, సూదన్‌పల్లి గ్రామాల్లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ కందుకూరి చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట అవార్డు గ్రహీతకు సన్మానం



రామన్నపేట: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ద్వారా విశిష్ట అవార్డు పొందిన ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.షుకూర్‌ను నగరంలోని రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధ్యులు గురువారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యున్నత అవార్డు పొందడం ద్వారా పోలీస్ శాఖకే కాకుండా ఓరుగల్లుకు కూడా కీర్తి ప్రతిష్టలు తేవడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాని, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పక్కాగా జరగాలి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, మేయర్ సుధారాణి, కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్/కాజీపేట రూరల్/కాజీపేట : నగరంలో తాగునీటి సరఫరా పక్కాగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు ఆదేశించారు. హనుమకొండ వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌ను గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి నీటి సరఫరా తీరు, సరఫరా విధానాన్ని అధికారులను అడిగి తగు సూచనలు చేశారు. వన మహోత్సవంలో భాగంగా పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు సిరంగి సునీల్‌కుమార్, విజయశ్రీ, మాజీ కార్పొరేటర్ అబూబకర్, ఈఈలు రవికుమార్, మాధవీలత, డీఈలు సారంగం, కార్తీక్ రెడ్డి, ఏఈలు హరికుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాపూజీ నగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ తనిఖీ..

కాజీపేటలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సందర్శించారు. ట్యాంకు నుంచి తాగునీరును సకాలంలో ఎందుకు అందించలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించారు. కొత్త మోటార్లతో పాటు మరో ట్యాంకు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు.

రైల్వే జీఎంకు వినతుల వెల్లువ



వినతి పత్రం అందజేస్తున్న రాఘవేందర్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మానుఫాక్చరింగ్ యూనిట్ తనిఖీ నిమిత్తం గురువారం వచ్చిన రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను రైల్వే జేఏసీ నాయకులు, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే సంఘ్ నాయకులు కలిసి పలు సమస్యలపై వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. పంజాబ్ కపుర్తాలో ఉద్యోగాలు ఇచ్చిన విధంగా కాజీపేట రైల్వే మానుఫాక్చరింగ్ యూనిట్‌లో యువతకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలని, కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయాలని, కాజీపేట టౌన్ స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కాజీపేట రైల్వే జేఏసీ కన్వీనర్ దేవుపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జీఎంకు వినతిపత్రం అందజేశారు. డీజిల్‌కాలనీ రైల్వే క్వార్టర్స్, కార్మికుల సమస్యలపై రైల్వే మజ్దూర్ డీజిల్ బ్రాంచ్ నాయకులు ఎస్‌కే.జానిమియా, పాక వేదప్రకాష్, గిరిమిట్ల రాజేశ్వర్ వినతి పత్రం అందజేశారు. కాజీపేటలో రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జీఎంకు రైల్వే సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వెంకటనారాయణ, దిలీప్, లోకో రన్నింగ్ బ్రాంచ్ నాయకులు పాక రాజ్‌కుమార్, ముస్తాక్ హుస్సేన్, బల్విందర్‌సింగ్, రాజేందర్, లక్ష్మినారాయణ, గుప్తా, పరమేశం, మాధవరావు, రమేష్‌బాబు వినతి పత్రం అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్వప్న, మహిళలు

ఖిలా వరంగల్: మహిళలు రక్షణ, భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి సెంటర్ నిర్వాహకురాలు స్వప్న సూచించారు. ఈ మేరకు వరంగల్ ఎల్‌బీనగర్ లోతుకుంట కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కరీమాబాద్ ఉర్సు ఎస్ఎల్ఎఫ్, సఖి సెంటర్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో సఖి సెంటర్ సేవలు, 181 టోల్‌ఫ్రీ నంబర్ వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, భద్రతపై అవగాహన కల్పించారు. బాధిత మహిళలు, బాలికలకు ఉచిత కౌన్సెలింగ్, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ సోషల్ కౌన్సెలర్ నూర్జహాన్, ఆర్పీ లావణ్య, అంగన్‌వాడీ టీచర్ సత్య వేద, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న జిల్లా బాధ్యులు

మడికొండ: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కాజీపేట మండలం మడికొండ, రాంపూర్, తరాలపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, పెండింగ్ డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకులాలకు కలిపి కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని సూచించారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా బాధ్యులు సీహెచ్.లింగారావు, సదానందం, బ్రహ్మాచారి, దావు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



తయారు చేసిన ఎల్ఈడీ బల్బులను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఎల్ఈడీ బల్బుల తయారీ విధానంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ గురువారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ జితేందర్, డాక్టర్ సరిత, డాక్టర్ సరిత, డాక్టర్ ప్రశాంత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ భాషా నైపుణ్యాలు



విద్యార్థులకు హిందీ భాషా నైపుణ్యాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు రాములు

విద్యారణ్యపురి: హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు హిందీ భాషా నైపుణ్యాలను హిందీ స్కూల్ అసిస్టెంట్ సీహెచ్.రాములు నేర్పిస్తున్నారు. హిందీ లాంగ్వేజ్ స్పీకింగ్ ఎబిలిటీలో భాగంగా వినూత్నంగా పాఠశాలలోని వివిధ రకాల చెట్లు, పూల మొక్కల వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి వాటి గురించి హిందీలో బోధిస్తున్నారు.